




# మళ్ళీ జన్మించు, మహాత్మా!

నామిని సుబ్రహ్మణ్యం

**రైలు** పట్టాల మీద రక్తాన్ని చూసిన వాడి కళ్ళు బైర్లు కమ్మాయి. ముఖం పాలి పోయింది; నెత్తురు చుక్కకు కరువైంది. 'అది కేశవరెడ్డి ఏమూ!' వాడి మనసు బల్ల గుద్ది చెప్పింది. వాడి కళ్ళ ముందు కేశవరెడ్డి ఉగ్రరూపమే కనబడుతూంది ఆ క్షణంలో.

'అమ్మో! కేశవరెడ్డి చంపేస్తాడు!'

వాడు పరుగు లంకించుకున్నాడు.

వాడికి భయంగా ఉంది. వాడి ఒళ్ళు క్షణ క్షణానికీ వేడెక్కి పోతూంది. చెమటలు కక్కేస్తూంది. అయినా, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పరుగెత్తుతూనే ఉన్నాడు.

కాలికి ముల్లు గుచ్చుకుంది. లెక్క చేయలేదు; ఎదురు రాయి తగిలింది. బొటన వేలు చితికి నెత్తురు కారింది. అయినా, ఏ మాత్రం లెక్క చేయడం లేదు. పరుగెత్తుతున్న వాడి మనసులో రైలు పట్టాల మీద రక్తం, పేగులు, తల, కేశవరెడ్డి భయంకర రూపం! ఉండి ఉండీ వెనక్కి తిరిగి చూస్తూ పరుగు సాగిస్తున్నాడు. వాడికి ముందుగా గొర్రెల మందను ఊరి ముఖం పట్టిస్తూ అదిలిస్తున్నాడు గంగయ్య. వాడి గుండె ఒక క్షణం లయ తప్పి సర్దుకుంది. కాలికి మించిన వాడి పరుగు కాలికి మించిన నడకగా మారింది. ముఖాన చిరునవ్వు పులుముకున్నాడు.

మామూలుగా ఉండటానికి ప్రయత్నించాడు. "గొడ్లను యాడొదిలేస్తివిరా? ఒంటిగా బోతా ఉండావు" అని అడిగితే ఏం చెప్పాలో అర్థంకాని వాడి చిన్ని బుర్రకు అదొక పెద్ద సమస్యగా తయారయింది.

గంగయ్యను దాటేశాడు. గంగయ్య తనను పల్లెత్తు మాటయినా అననందుకు దేవుళ్ళంతా తన పాలిట ఉన్నారని తృప్తిగా నిట్టూర్చాడు తాత్కాలికంగా. అడవిలో గంగయ్య గొర్రెను పొట్టి నక్క నోట కరిపించుకుని వెళ్ళి ఉంటుందని, అతని పరధ్యానానికి కారణంగా ఊహించుకున్నాడు.

చచ్చీ చెడి కొత్త చెరువు క్రింది బీడులోంచి ఆర్. టి. సి. బస్సులు పోయే రోడ్డున పడ్డాడు. ఆ రోడ్డున ఐదారేళ్ళ నించి ఆర్. టి. సి. బస్సులు నడుస్తున్నా, దాని పేరుకు 'గతుకుల రోడ్డు' నించి 'తారురోడ్డు'గా ప్రమోషను రావడంలేదు. రోడ్డంతా చెల్లాచెదురుగా గులక తేలిపోయి ఉంది. ఆ గులక మీద కాలు పడుతూంటే వాడి గుప్పెట్లోని ప్రాణాలు కాస్తా నేలజారిపోయేలా ఉన్నాయి. అయినా, పరుగెత్తుతూనే ఉన్నాడు.

కరణంగారి మామిడి తోపు దాపుకి వచ్చేశాడు. వాడికి కొంచెం ధైర్యం చిక్కింది. ఆ తోపులో ఉన్న అల్లనేరేడు చెట్టు తన కమ్మటి పళ్ళతో వాణ్ణి సాదరంగా ఆహ్వానించింది. కానీ, వాడికి అది నేరేడుపళ్ళ కాలమనీ, తోపులో అల్లనేరేడు చెట్టు అనేది ఒకటి ఉందనీ, దాని పళ్ళు చక్కెర తునకలనీ ఏ మాత్రం గుర్తుకు రావడం లేదు. వాడే మరొక సమయంలో ఉంటే, చెట్టెక్కి ఏరి కోరిన పళ్ళను కడుపారా తిని మరీ బయటికి వచ్చేవాడు. కానీ, ఇప్పుడు పరుగెత్తాలి—కాలి కొద్దీ, శక్తి కొద్దీ. రామాపురం వారి వేణుగోపాలస్వామి గుడి ముందు వచ్చాడు.

వాడికి పూర్తి ధైర్యం చిక్కింది. 'ఇక్కడెవ్వరూ మనూరోళ్ళు ఉండర్లే' అనుకున్నాడు. గుడి ముందు ఉన్న ఊడల మర్రి వాడికి జడలు దయ్యంలా కాక, ఆశ్రమంలా కనుపించింది. వాడి కాలి బొటన వ్రేలు జివ్వు జివ్వుమంటూంది. ఇక పరుగెత్తలేననిపించింది. వాడి కాలు అడుగు వేయమంటే వేయనని సతాయించింది.


మర్రి చెట్టును ఆనుకుని కూర్చున్నాడు. తను వచ్చిన దారి వైపు ఒక్కసారి తల ఎత్తి చూశాడు. నోటినుంచి, ముక్కు నుంచి వస్తున్న గస కాస్త తగ్గినట్టనిపించింది.

వాడికి వాడి ఊరు కళ్ళ ముందు కదలాడింది.

రాములమ్మత్త!

'రావులమ్మత్త ఎంత మంచిది. ఆమె ఎవ్వరో కాదు. నాయనోళ్ళ చెల్లె లంట. తాత చెప్పాడు. ప్చ్! తాత చచ్చిపోయాడు.'

వాడికి ఏడుపు వచ్చింది. ఎంతగా ఆపుకోవాలన్నా నిలవడం లేదు. అంతటి దుఃఖం నిజానికి తాత చచ్చి పోయినప్పుడుకూడా రాలేదు. ఆసలా రోజు గోళీ లాటను విడవనే లేదు. గూట్లోకి వెళ్ళిన పొద్దుతో పాటుగా ఇల్లు చేరాడు. చింపిరి చాప మీద తాతను పడుకో బెట్టడం చూశాడు. తాత




తలకాడ దీపం ఉంది. కాళ్ళ కాడ వడ్లగింజలు ఉన్నాయి. నోట్లో నలగ గొట్టిన తులసిఆకు ఉంది. అదంతా చూసిన వాడికి రోత పుట్టింది. ఇరవై నాలుగు గంటలూ వక్కాకు నమిలి ఎర్రగా ఉండే తాత నోట్లో తులసి ఆకు ఉండగా బాధగా అనిపించింది. 'చచ్చి పోవడం అంటే ఇదా?' అనిపించింది. అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు కమ్మాయి. ఆ కళ్ళలో నీళ్ళు చెంపల మీదికి జారక ముందే రాములమ్మత్త వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళింది.

వనజాక్షి చేత స్నానం చేయించింది. వనజాక్షి ఎవరో కాదు. రాములమ్మత్త కూతురే! మబ్బి దగ్గరి నుంచి తీసుకు వచ్చిన ఎర్ర సబ్బుసకూడా పూసింది. తలకు చమురు పెట్టింది. తల దువ్వి జడ వేసింది. పాత గుడ్డలే వేసింది. అవి అగ్గిలో వేసినా కాలవు. అప్పుడు వాడికి కేశవరెడ్డి మనవడి లాగా ఇస్త్రీ చేసిన లాగూ, చొక్కా వేసుకోవాలనిపించింది. నీళ్ళలో తన పూర్తి ప్రతిబింబాన్ని చూసుకోవాలనిపించింది. ఆ రాత్రి రాములమ్మత్త వనజాక్షి అక్క చేత కూడు వండించింది. వంకాయ పులుసు పెట్టించింది. కోడి గుడ్డు అట్టుకూడా పోయించింది. చారు పెట్టించింది. నాగమ్మ దగ్గర మజ్జిగ తెప్పించింది. ఆ తిండి వాడి చిన్నారి పొట్టకు ఇంకా గుర్తు ఉంది.

తాత చచ్చిపోయాక రెండు రోజులు బడికివెళ్ళాడు. రాములమ్మత్త పంపించింది. మూడవ రోజు అత్త తల దువ్వుతూంటే సేద్యగాడు రాముడు 'చిన్న రెడ్డి రమ్మంటుండాడు' అంటూ వచ్చాడు. 'ఏటో!' ననుకుంటూ రాములమ్మత్త రెడ్డి ఇంటికి వెళ్ళింది, వాణ్ణి తీసుకుని.

"ఏందే,రావీ? నీ ఉద్దేశ్యం జెప్పు." బీడీ తాగుతూ కేశవరెడ్డి అడిగాడు.

"ఏంది, సామీ?" అర్థం కానట్టు అడిగింది రాములమ్మత్త.

"అదేనే. గొడ్ల నెవురు మేపుతారని?"

రాములమ్మత్త తల వంచుకుంది.

రెడ్డి అన్నాడు: "ఈ పొద్దు కాదనుకుంటే రేపొచ్చేది కాదే, రావీ! మామూలు పూడస్తాది. నా మాటిని ఆ పుజ్జోగానికి వాణ్నెయ్."

వాడి గుండెతో పాటు రాములమ్మత్త గుండెకూడా గతుక్కుమంది. వాడికి విషయం అర్థమయింది. వాడి తాత ఊళ్ళో గేదెలన్నింటినీ కాపు గాస్తాడు. తాత చచ్చిపోయాక ఆ ఉద్యోగం ఎవరు చేయాలన్నది బహుశా రెడ్డి సమస్య కావచ్చని వాడి మెదడు అంచనా వేసుకుంది. వాడి వంశమంతా ఈ ఉద్యోగమే చేస్తుందనికూడా వాడికి తాత చెప్పాడు. రాములమ్మత్త రెడ్డి మాటల్లో నిజం ఉందనిపించింది. అయినా, ఒక మాట అని చూసింది.

"వోడు పిలగోడు గద, సామీ? వోడి వల్ల అవ్వదు. అదీగాక సదవతా వుండాడు."

"ఎట్టా, వోడా పిలగోడు? ఇప్పుడు పెండ్లి జేస్తే ఇద్దర్ని గన్నాడు?. . . వోడొల్ల కాదంటావా? కట్లు ఇప్పేసిన గొడ్లని చెంగా బీట్లోకి తోలుకెళ్ళి సందేలకి ఊళ్ళోకి తిరగ తోలుకు రావడమే గదా! అగ్గో—నువు ముక్కి మూల్గినావంటే ఈ 'జవు కొనుముల్ని' మేపే పుజ్జోగం మీ తరానికి లేకుండా పోతది. ఆరు గాలంలో కళ్ళాలల్లో కొలిచిచ్చే గంపెడు వడ్లగింజలూ చేతి కందవు. ఆ. ఇంక సదువంటావా? దానెమ్మ! డిగ్గిరీ ల్జదివి నోల్లు డింకీలు కొడతా ఉండారు. అయినా, రావీ! వోడు సదివి ఈ ఊరికి పెసిడెంటు గావాల్నా? తాలూకాకి తాసీల్దారు గావాల్నా? జిల్లాకి కలెక్టరూ, రాష్ట్రానికీ ముఖ్యమంత్రీ, దేశానికి పెధానమంత్రీ గావాల్నా ఏంటి? ఆడు సదివి పూళ్ళేలాల్సింది పన్లేదు గాని, గొడ్ల మేపుకుని పొట్ట కూటికి జంపాయించుకుంటే వోయమ్మ కాళ్ళు." రెడ్డి సందేశాత్మకమయిన ఉపన్యాసం రాములమ్మత్త తలకు బాగా ఎక్కింది.

అంతే! ఆ మరుసటి రోజు నించి పలకా బలపం పట్టిన వాడి చేతులు గొడ్ల కాడకు కర్రను పట్టాయి. వాడికి బడికి పోతేనే బాగుంటుందనిపించింది, రెండు

ఉమేష్ యోగ దర్శన్
(ప్రథమ ముద్రణ)
(ఇంగ్లీషులో లేదా హిందీలో)
'ఎ గైడ్ టు హెల్దీ లివింగ్' (ఆరోగ్య జీవనానికి మార్గం). యింటింట్లో ఉండి తీరాలి! సచిత్రమైన యీ పుస్తకంలో వివిధ యోగాసనాలున్నాయి వివరంగా—వాటితో మీ శరీరాన్ని చక్కని ఆరోగ్యమైన స్థితిలో ఉంచుకోవచ్చు. మలబద్ధం మొదలైన యితర అస్వస్థతలను దూరంగా ఉంచచ్చు. దాంతోబాటే మనశ్శాంతిని యిస్తుంది. అన్ని ఆసనాలూ పూర్తిగా వివరించబడినాయి, రోగ పరీక్షను గూర్చిన సూచనలూ, ఆహార నియమాలూ పొందుపరచబడినాయి.
ధర : హిందీ (రు. 30/-); ఇంగ్లీషు (రు. 30/-) పోష్టు ఖర్చులు అదనం : 5/-
శ్రీ రామ్‌తీర్థ్ యోగాశ్రమ్
Tel. దాదర్ (మధ్య రైల్వే), బొంబాయి 400 014. ఫోన్ : 442899.

బైద్యనాథ్

శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్ 60 సం॥ల క్రితం స్థాపించబడి దేశవిదేశాలలో ఆయుర్వేద ఔషధములు తయారుచేయు పెద్ద సంస్థగా ప్రఖ్యాతి గాంచినది.

ప్రాచీన ఆయుర్వేద గ్రంథముల ననుసరించి 700 రకముల ఆయుర్వేద ఔషధములు కలకత్తా, పాట్నా, ఝాన్సీ, అలహాబాద్ మరియు నాగపూరులలోని 5 కర్మాగార ములలో అత్యంత అధునాతన పద్ధతిలో బైద్యనాథ్‌చే తయారుచేయబడు చున్నవి.

బైద్యనాథ్ ఔషధాలు 800 విక్రయశాలలు మరియు 60,000 ఏజన్సీలు మరియు ఔషధ విక్రేతలద్వారా భారతదేశ మంతటా లభించుచున్నవి.



మీ కుటుంబ ఆరోగ్యమునకు
బైద్యనాథ్ ఔషధములయందు విశ్వాసముంచండి.

INTERMARK/ SBAB/ 16

బైద్యనాథ్: ఆయుర్వేద శాస్త్ర ప్రామాణికతకు మారుపేరు

విక్రయశాలలు ఆంధ్రప్రదేశ్ : 21-7-802, హైకోర్టు ఎదుట, హైదరాబాద్-2.
కర్ణాటక : టి.వి.కె. అయ్యంగార్ రోడ్, బెంగుళూర్.

నించి మూటికీ, మూడు నించి నాలుక్కీ పెద్ద తరగతులు చదవచ్చు. అయినా, నొసట తన కా గీత లేదని సర్దుకున్నాడు.

ప్రకృతి అంతా నల్లబడింది. వాడు పైకి లేచాడు. పాడు బడిన వేణుగోపాలస్వామి ఆలయానికి రెండు చేతులూ జోడించి దండం పెట్టుకున్నాడు. వాడికి రాములమ్మత్తనూ, వనజాక్షినీ, తను రోజూ ఈత గొట్టే కొత్త చెరువునూ వదిలి ఎక్కైనా వెళ్ళాలంటే బాధగా ఉంది. కానీ, వాళ్ళను వదిలి పెట్టకుండా ఊర్లోనే ఉంటే కేశవరెడ్డి తప్పకుండా చంపేస్తాడు!

వాడు అక్కడినుంచి కదిలాడు. ఆకాశంలోకి ఎగచూశాడు. పిసరంత మబ్బయినా లేదు. చుక్కలు ఆత్మీయుల్లా కనుపించాయి. 'చుక్కలకు తోడుగా చందమామ ఉంటే ఎంత బాగుండు' నని కవిలా బాధ పడ్డాడు. పిల్ల గాలి చెబ్బాట పుట్టతో పాటు వాణ్ణికూడా పలకరిస్తూంది. అయినా వాడి ఒంటి మీద చెమటలు మాత్రం ఆరడం లేదు. అంత దూరంలో ఎక్కడో తాటిమట్ట క్రింద పడ్డ శబ్దం వినవచ్చింది. వాడి గుండె గుభేలుమంది. ఎలుక గుండెకు మల్లె వేగంగా కొట్టుకుంది.

అలాంటి సమయాల్లో శ్రీరామచంద్రుణ్ణి తలుచు కుంటే ఎలాంటి ఆపదా రాదని వనజాక్షి చెప్పిన మాట గుర్తు వచ్చింది. వెంటనే వాడి గుండె లబ్ డబ్ అనడం మానేసి 'శ్రీరామ శ్రీరామ' అంటూ మొర పెట్టుకుంది.

వాడు జోరుగా నడుస్తున్నాడు. కారుతూన్న ముక్కునూ, జారుతున్న నిక్కరునూ—రెంటినీ రెండు చేతులతో సమాధాన పరుస్తున్నాడు.

ఉన్నట్టుండి వాడు ఉలిక్కిపడ్డాడు. అంతలోనే తేరుకున్నాడు. ఎడ్లను అదిలించే గొంతునుబట్టి అతను తన ఊరివాడు కాదని నిర్ధారణ చేసుకున్నాడు. ధైర్యంగా అడుగు ముందుకు వేశాడు. బండి పక్కగా నడిచాడు. బండినిండా కట్టెలు ఉన్నాయి. ఆ బండి వానితో ఎలాగయినా మాటలు కలపాలని వాడి మనసు ఉవ్విళ్ళూరుతూంది.

"ఓ అన్నా!" అని పిలిచాడు.

"ఏరా, అబ్బోడా! యాళగాని యాళ ఒంటిగా వస్తా ఉండావు." అనడిగాడు, చటుక్కున తల త్రిప్పి ఆశ్చర్యపోతూ.

వాడు జరిగిపోయిన ఘోరాన్ని పూసగుచ్చినట్టు చెప్పాడు.

అతను బిడ్డల్ని కన్నవాడులా ఉంది. అతడికి వీడి మీద అమితంగా జాలివేసింది.

"నువ్వేమీ బయపడద్దు. ఇట్రా" అని ఎద్దుల పగ్గాల్ని లాగి బండి ఆపుచేశాడు.

వాడు బండెక్కి కట్టెల మీద ఒద్దికగా కూర్చున్నాడు. టవున్‌లో కోర్టుకు పక్కగా మంచి సెంటర్లో ఉన్న రెడ్డమ్మ మెస్‌లో పనికి కుదరడం వాడు తన పూర్వజన్మ సుకృతంగా భావించాడు. ఆ మెస్‌లో పదిమంది దాకా పనివాళ్ళు ఉన్నారు. అందర్నీ శుభ్రంగా ఉండమని రెడ్డమ్మ మరీ మరీ హెచ్చరిక చేస్తూ ఉంటుంది.

వాడితల ఇప్పుడు అప్పటిలాగా గీరేసిన తాటి

పండులా ఉండడం లేదు. నూనెపెట్టి శుభ్రంగా అణగ దువ్వి ఉంది. నాలుగైదుసార్లు అద్దంలో మొహంకూడా చూసుకున్నాడు. అలా చూసుకున్నప్పుడు — 'నా మొహం ఇంత బాగుంటుందా!' అనిపిస్తుంది వాడికి. వాడి ఒంటిమీద బట్టలు ఇప్పుడు అగ్గిలో వేస్తే భగ్గున మండుతాయి. పూట పూటా తినే తిండికూడా రాములమ్మత్త తిండిని మరిపిస్తాంది.

రెడ్డమ్మ కూడా చాలా శుభ్రంగా ఉంటుంది. పచ్చచీర కట్టుకుంటుంది. నిండుగా రవిక వేసుకుంటుంది. చేతులు నిండుగా గాజులు పెట్టుకుంటుంది. రూపాయంత బొట్టు పెట్టుకుంటుంది. ఎప్పుడూ పెదాలపై చిరునవ్వు కదలాడుతూంటుంది. అనంతా వ్యాపారంలో చిట్కా అని తేలికగా అర్థం చేసుకున్నాడు వాడు.

వాడికి రెడ్డమ్మ చాలా మహారాజు బిడ్డలా, పెట్టి పుట్టిన దానిలా అనిపిస్తుంది. వాడు ఆమెను చూసినప్పుడెల్లా, ఆమె బొడ్డులో దోపుకుని ఉన్న తాళాల గుత్తిని గమనిస్తాడు. 'ఆమె ఇంట్లో దండిగా ట్రంకు పెట్టెలుండేటట్టుండాయి' అనుకున్నాడు.

రోజుకు మూడు వందల మందయినా ఆ మెస్‌లో చెయ్యి కడుగుతారు. అందరికీ వాడు విస్తర్లు వేస్తాడు. ఎంగిలాకులు ఎత్తుతాడు. అలా ఎత్తేటప్పుడు వాడికి కాస్త చిన్నతన మనిపిస్తుంది. కేశవ రెడ్డి వాళ్ళ పెరట్లో పేడ నీళ్ళు ఎత్తేటప్పుడు కూడా వాడికి అలాగే అనిపిస్తుంది. అప్పుడప్పుడట లోటాలలో నీళ్ళు పోయడమంటే మహా సరదా వాడికి.

ఆ రోజు మెస్ రద్దీగా ఉంది. వాడి దృష్టిలో, ఆ రోజు చుట్టుపక్కల పల్లె ప్రజలు కోర్టుకు ఎక్కువగా వచ్చారని అర్థం. మెస్ ముందు ఉన్న కుప్పతొట్లో ఎంగిలాకులు విసిరేసి గడపలో అడుగు పెట్టిన వాడు నిర్విణ్ణుడై పోయాడు. నిలువెల్లా వణికిపోయాడు — పులిని చూసిన మేకలా, గాలిలోని దీపంలా, పిల్లి చేతుల్లోని ఎలుకలా.

"ఒరేయ్! ఆకులెయ్!" వాడి తత్తరపాటును గమనించని రెడ్డమ్మ ఆర్డర్ జారీచేసింది.

పిల్లిలా అడుగులు వేసుకుంటూ విస్తరాకులు ఎత్తుతున్నాడు.

ఆకులు వరుసగా పెడుతున్నాడు.

కాళ్ళు గాలిలో తేలిపోతున్నాయి.

కళ్ళు బూజులు కమ్ముతున్నాయి.

ఒక ఖద్దరు చొక్కా ముందు వణుకుతున్న చేతులతో ఆకును పెట్టాడు.

"రెడ్డమ్మా!"

ఖద్దరుచొక్కా ఖరీదైన మనిషి పొలికేకపెట్టింది.

వాడి గుండెలో పిడుగు పడింది.

"ఏం రెడ్డీ! ఆఁ ... వస్తున్నా ... అరె ... ఇంకా అన్నమే పెట్టలేదే? ... రేయ్! వడ్డించు. రెడ్డొచ్చి ఎంతసేపైంది!" ఒక పనిమనిషిని పురమాయిస్తూ, నవ్వు ముఖంతో రెడ్డమ్మ వచ్చింది.

ఖద్దరు చొక్కా ముఖం చిట్లించుకుని పైకి లేచింది.

రెడ్డమ్మ గాభరా పడిపోయింది.

వాణ్ణి ఎడమచేతితో చాచి చెంపదెబ్బ కొట్టింది—

ఖద్దరు చొక్కా! వాడికి వాళ్ళ ఊళ్ళో ఉన్న పోలేరమ్మ మాతమ్మ గుళ్ళో ఉన్న పోతురాజులూ, రామాపురం వారి వేణుగోపాలస్వామీ ప్రత్యక్షమయ్యారు ఆ దెబ్బకు!

రెడ్డమ్మను కౌగలించుకుని ఏడవా లనిపించింది. కానీ, రెడ్డమ్మ రాములమ్మత్త కాదు; వాడి తండ్రి చెల్లెలు మరీ కాదు.

వాడు నీరుకారిపోతూ రెడ్డమ్మ వెనక్కు వెళ్ళాడు.

"వో డిక్కడిక ఎట్టొచ్చినాడు?" రెడ్డిగారి చిన్ని ప్రశ్న.

"వో దేవుడో నాకు తెల్వదు, రెడ్డీ! మన మెస్‌కి వాడిగ్గా ఒకడు వంట చెయకు తోలాడు... ఒకనాడు అర్ధరాత్రికాడ యీణ్ణి తోడకొచ్చినాడు. 'దిక్కులేనిపిలగోడు....ఈడేదన్నా పనుంటే యిప్పించ మన్నాడు...వాళ్లో చెప్పిన పని చేతో చేస్తూ నెల్నాళ్ళుగా ఈడనే ఉండాడు...ఆది ఇపుడేమయింది? వోడేం జేసినాడు?" వూసగుచ్చినట్టు చెబుతూ ఆపింది రెడ్డమ్మ.

---

**అనర్గళమైన వాగ్ధాటి కేవలం అగ్ని వర్షం కురిపించే తర్కం మాత్రమే.**

**- లైమన్ బీషర్**

---

"ఈడు మాదిగోడు...మా ఊర్లో గుంపు గేదెల్ని మేపేటోడు...దొంగ ముండా కొడుకు... ఒకరోజున పారిపోయి ఒచ్చేసినాడు...మా బంగారట్టా గేదెని నోట్లో పెట్టుకొని నీళ్ళు బోసుకున్నాడు...ఈడ కాలం గడపతుండాడు." మళ్ళీ వాణ్ణి అందుకొని కొట్టడానికి చెయ్యి పైకెత్తాడు. వాడు రెడ్డమ్మ కాళ్ళను చుట్టేశాడు.

రెడ్డమ్మకు ఇనంతా న్యూసెన్సుగా అనిపించింది. తినేవాళ్ళకు కూడా రిస్కుగా అనిపించింది. మన కెక్కడ జోలి అని వూరుకున్నారు. రెడ్డమ్మ ఓర్పుతో సమాధానం ఇవ్వకపోతే రేపు, మర్నాటికి వాడుకగా తినేవాళ్ళు మరో చోటు చూసుకోవచ్చు. అందునా ఆయన కేశవ రెడ్డి! ప్రెసిడెంటున్నా!

జరగరాని తప్పు జరిగిపోయినట్టు ముఖం పెట్టింది రెడ్డమ్మ. కాళ్ళకాడ పడి ఉన్నవాడి వీపును చీదరింపుగా చరిచి పైకి లేపింది. గోడ దెబ్బా, చెంప దెబ్బా రెండూ వాడికే!

"అట్టాగా, రెడ్డీ! యీడు మాదిగోడా? శానా తప్పయింది. ఏదో ఎర్రగా, బుర్రగా ఉంటే ఎక్కన కులమోడని భ్రమపడితి....ఆఁ. కూపోండి... ఇట్టాంటి పొరపాటు ఇంక జరగదులే...అమ్మో! ఇక్కడంతా నాయుళ్ళూ, రెడ్లూ తినే పని!.. రే పోరా! నీ దారి నువ్వు జూస్కో!" వాణ్ణి కసిరి పారేసింది.

రెడ్డి, తతిమ్మా వాళ్ళు అంతా కూర్చున్నారు.

వాడు నసుగుతూ అడుగులు మార్చుకుంటూ అక్కడే నిలబడ్డాడు. వెక్కిళ్ళు పుట్టేలా ఏడవా లనిపించింది.

"రే! పొమ్మంటే - నీక్కాదూ?" గట్టిగా కసురుకుంది.

"యాడికి వోడు బొయ్యేది? బంగారట్టా గేదెని నోట్లో పెట్టుకున్నాడు. అప్పట్నించి మా ఇంటిదాని ఆరోగ్గిం గూడా అంతంత మాత్తరమే!"

కేశవ రెడ్డి మాటలు అర్థంకాని రెడ్డమ్మ అడిగింది :

"ఏంది రెడ్డీ! యీడు గేదెని సంపేసి పారిపోయి వచ్చేసినాడా? వోరి యీణ్ణి నల్ల నాగుబాము నమలా!" మెటికలు విరిచింది రెడ్డమ్మ.

"ఆ...సంపేసినాడు! నిలువునా సంపేసినాడు! అడిగాదు, రెడ్డమ్మా! గేదెలు గాసే నాకొడుక్కి వేరే యాపారం ఏంది సెప్పు?! గేదెల్ని కొత్త చెరూ బీట్లో తోలిన గాడ్డి కొడుక్కి దుగ్గ సముద్రం పిలకాయలో ఏంపని? వోళ్ళతో బొయ్యి ఈతగెడ్డను కొట్టాడంట నాయాల!... అంతే, బంగారట్టా గేదె సచ్చిపోయింది!"

"యాంటికి సచ్చింది? పురుగు నాకేసిందా?' ఆందోళనగా అడిగింది రెడ్డమ్మ.

"అహ... పురుగూ గిరుగూ గాదు...రెడ్డమ్మా! గేదె మడ్డి జాడ్డి! అందునా చెరూ బీడు పక్కగా రైలు కట్ట ఉంది. ఆడుండేదంతా పొరంబోకే! సీమంత సైర్లేదు... గొడ్లని కాపు గాయాల్సిందంతా రైలొచ్చేయాలంకే! లేకపోతే...పట్టామీంద గొడ్డుంటే రైలు పొట్టన పెట్టుకుంటాది తేరగ.. అట్టాగే సచ్చిపొయ్యింది మా బంగారట్టా గేదె!'. రెడి చెప్పడం ముగించాడు. కేశవరెడ్డికి రెడ్డమ్మే అన్నీ స్వయంగా వడ్డించింది.

"రేయ్...పొయ్యి బైటుండు...రెడ్డి పోయేటప్పుడు తీసకెల్తాడు గాని..." కఠినంగా అంది రెడ్డమ్మ.

"అమ్మో! వోడు మళ్ళీ పారిపోడూ?! ఎంతకైనా వగదెగతాడు గాడద కొడుకు....లేకుంటే వూరికండ్లలో కారం గొట్టి యిట్టాగ పారిపోయి వచ్చేస్తాడూ! నా కొడుక్కి భయం....గేదె సచ్చినాక ఇంటికిపోతే సెప్పుతో యెంచి యేడేట్లు కొడతారని! అందుకే యిట్టా ఒచ్చేసినాడు! అంత సులభంగా వదల్తానా నేను! నా ఇంటికాడ పదేండ్లు పేడా కెత్రదోసి...వూళ్ళో గొడ్లమేపందే నా బంగారట్టా గేదె జమగాదు. ఆ గేదె కరీదు ఎయ్యి రూపాలూ సెల్లుబడి అయేదాకా కళ్ళాలల్లో గంపెడు గింజలు కూడా కొల్సేది లేదు...ఎవుడుతో సెప్పుకుంటాడో పొయ్యి సెప్పుకోనీ." చెప్పడం ఆపి, కేశవరెడ్డి ముక్కలు తినడం మొదలెట్టాడు.

వాడు బెల్లం కొట్టిన రాయిలా గోడనానుకుని అలాగే నిలబడి ఉన్నాడు. 'రెడ్డి తిండి పెట్టిస్తే బాగుండు'నని అనుకున్నాడు.

"మనిషికీ మనిషికీ మధ్య బానిస బంధం కూడా ఉందా? ఎంతగా తెంచుకుందామన్నా తెగని బంధమా అది?" మెస్ గోడకు తగిలించి ఉన్న కాలెండర్‌లోని ఆగస్టు 15 ఫోటోన ఏడుస్తూ, "బానిస బంధాన్ని రూపుమాపేందుకు—'మళ్ళీ జన్మించు, మహాత్మా!'" అని గాంధి గారిని వేడుకొంది. ★